సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 18 । జూలై । 2023



భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. - 8లో



కర్నూలు జట్టు ఘన విజయం

కడపలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు విజయం సాధించింది. కర్నూలు బౌలర్ అక్షిత్‌రెడ్డి ఒక్క మ్యాచ్‌లో 12 వికెట్లు తీసి సత్తా చాటాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1290	రూ.1400
రెండోరకం	రూ.1050	రూ.1260



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 490 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	--	469
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 57.10 కిలోలు

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశం

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయ కార్యదర్శి సుజాతపై విచారణకు సోమవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శి తరచూ విధులకు గైర్హాజర్ కావడం, విధి నిర్వహణలో అలసత్వ ధోరణి, ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం దుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేక పోవడంతో గ్రామాల్లోని కొన్ని ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. విధులకు దుమ్మా కొడుతూ యోగివేమన వర్సిటీలో రెగ్యులర్ పీజీ చేస్తున్నట్లు ఫిర్యాదు కూడా ఉందన్నారు. మంగళవారం నుంచి ఈ అంశంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఎంపీడీఓను ఆదేశించినట్లు డీపీఓ తెలిపారు.

పనిచేసే చోటే నివాసం ఉండాలి



మాట్లాడుతున్న డీడీ జాకీర్‌హుస్సేన్

రాయచోటి అర్బన్/రాయచోటిటౌన్ : జిల్లాలోని వసతిగృహ సంక్షేమాధికారులందరూ (వార్డెన్లు) తాము పనిచేసే చోటనే తప్పని సరిగా నివాసం ఉండాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ జాకీర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం పట్టణంలోని వసతిగృహ సంక్షేమ అధికారులతో ప్రభుత్వ బాలుర వసతిగృహం–3లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం వసతి గృహ విద్యార్థులందరి చేత బయోమెట్రిక్ హాజరును 100 శాతం విధిగా నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పని సరిగా వసతిగృహాల్లో వందశాతం అమలు చేయాలలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు వసతి గృహాల్లో ట్యూటర్లను నియమించి వందశాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూఓలు రఘురామయ్య, జయప్రకాష్, శ్రీరాములునాయక్, ప్రేమ సాగర్, శ్రీనివాస మూర్తితో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

చేనేత జౌళి శాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వి.హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కర్నూలు ఏడీగా పనిచేస్తున్న ఈయనకు వైఎస్సార్ జిల్లా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇక్కడ పనిచేస్తున్న భీమయ్య పదోన్నతిపై ఒంగోలు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని చేనేత వర్గాల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై చిరుత

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై సోమవారం రాత్రి 8 గంటలకు చిరుత సందర్శకులకు కనిపించింది. మదనపల్లెకు చెందిన భాస్కర్, అనిల్ బైక్‌పై హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. వె కొండపై పర్యటన ముగించుకుని 8 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి మలుపు దాటుకుని రెండో మలుపు వద్ద కాఫీతోట వద్దకు రాగానే చిరుత పులి తోటలో పొదల నుంచి వెళ్తుండటం చూసి భయాందోళనకు గురయ్యారు. అయితే చిరుతను చూడాలన్న కుతూహంతో బైక్ ఆపి చూడగా కాఫీతోటలో నుంచి అడవిలోకి వెళ్లిపోయిందని వారు చెప్పారు. కాగా హార్సిలీహిల్స్‌పై కొన్ని నెలల క్రితం ఘాట్‌రోడ్డులోని పలుచోట్ల చిరుతలు సందర్శకులకు కనిపించాయి. తాజాగా మళ్లీ కనిపించడంతో సందర్శకులు జాగ్రత్తలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రామములగ..
రక్షించుకునేదెలాగ?



ఇతని పేరు ప్రసాద్. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం తలారివాండ్లపల్లె. మూడు ఎకరాల్లో టమాట పంట సాగు చేశాడు. అనుకున్నంత దిగుబడి రాలేదు.మార్కెట్లో ధరలు బాగున్నాయి. ఉన్న పంటలో కాయల్ని కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నాడు. చుట్టు పక్కల రాత్రిళ్లు టమాటాలను దొంగలు చోరీ చేసుకెళుతున్నారు. దీంతో ఉన్న పంటను కాపాడు కోవడానికి కాపలా కట్టుదిట్టం చేసుకోవడం తప్పడం లేదు. ప్రస్తుతానికి కుటుంబ సభ్యులతో పాటు మరో ఇద్దరిని కాపాలాగా ఏర్పాటు చేసుకున్నాడు. పంట కాలం ముగిసే వరకు 24 గంటలు కాపాలా కాసే వారిని ఏర్పాటు చేసుకుంటున్నాం. వారికి నెలకు రూ. 15 వేలు వరకు చెల్లించాలని చెబుతున్నాడు.



ఇతని పేరు సుమన్. గుర్రంకొండ మండలం అమిలేపల్లె. తాతలు, తండ్రుల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారు. ఎప్పుడు కూడా ఏ పంటకు ఇలా కాపాలా పెట్టుకోలేదు. టమాట చరిత్రలో ఎప్పుడు లేనంతా ధరలు పెరిగిపోయాయి. దొంగలు కూడా పంటలపై పడి కాయలు చోరీ చేసుకెళుతున్నారు. దీంతో కూడా రాత్రిళ్లు పంటకు కాపలాగా ఉండాల్సి వస్తోందని చెబుతున్నాడు.

- టమాట క్రేట్ ధర రూ.3500–4000
- దేశచరిత్రలో ఇదే అత్యధికం
- తోటల్లో రాత్రిళ్లు కాయలు చోరీ



గుర్రంకొండ మండలం చెరువుమొరవపల్లెలో రాత్రిళ్లు దొంగలు టమాటాలు కోసుకెళ్లడంతో కాయలు లేకుండా ఉన్న తోట

గుర్రంకొండ(అన్నమయ్య జిల్లా) : టమాట రైతు ఓవైపు ఆనందంతో, మరోవైపు భయంతో రోజులు గడుపుతున్నాడు. టమాటా 25 కిలోల క్రేట్ ధర రూ.3500 నుంచి రూ.4000 వరకు పలుకుతోంది. జిల్లాలో పలుచోట్ల రాత్రిళ్లు టమాటాల్లో దొంగలు పడి ఇష్టానుసారంగా దోచుకెళుతున్నారు. చేసేదిలేక రైతులు టమాట పంటలకు కాపలాగా పడుకుంటున్నారు. మరికొందరు ఇతరులను ఏర్పాటు చేసుకుంటున్నారు.

జిల్లాలో ప్రస్తుతం 1080 టన్నులకు టమాట దిగుబడి పడిపోయింది. గత నెలలో 3000 టన్నుల వరకు ఉన్న పంట దిగుబడి 2/3 వంతు తగ్గి 1080 టన్నులకు నిలిచిపోయింది. గత ఏడాది జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల పరిధిల్లో ఈ సీజన్‌లో 14వేల నుంచి 15,204 ఎకరాల్లో టమాట పంట దిగుబడి వచ్చింది. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులు, టమాట పంటకు సోకిన వివిధ రకాల రోగాలతో ప్రస్తుతం తోటలు భారీగా దెబ్బతిన్నాయి. వీటితోపాటు భారీ ఎండల తాకిడికి పూర్తిగా పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అయితే రాయలసీమ జిల్లాల్లో ఈ సీజన్‌లో ఈ ప్రాంతంలో ఎక్కువగా టమాట పంట సాగుచేస్తుంటారు. వేసవి కాలంలో అన్ని ప్రాంతాల కంటే అన్నమయ్య జిల్లాలోని పడమటి ప్రాంతాలలో(పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె) వాతావరణమే టమాట సాగుకు కొంత మేరకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇక్కడి టమాటాలకు దేశ వ్యాప్తంగా భారీ డిమాండ్ ఏర్పడింది.

దేశ చరిత్రలో ఇవే అత్యధిక ధరలు

వారం రోజులుగా టమాట ధరలు భారీగా పుంజుకున్నాయి. ఇవి దేశ చరిత్రలో అత్యధిక ధరలుగా రికార్డయ్యాయి. పదిహేను రోజుల కిందట 25 కిలోల టమాట క్రేట్ ధరలు అత్యధికంగా రూ.1200 లోపే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ. 3500 నుంచి రూ.4000 వరకు పలుకుతోంది. వారం రోజులుగా మార్కెట్లో దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోతోంది. మన రాష్ట్రంతో పాటు బయట రాష్ట్రాల్లో కూడా ఎక్కువగా టమాట పంటలు సాగు చేశారు. అయితే పలు కారణాలతో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో సాగు చేసిన టమాటాలకు దేశవ్యాప్తంగా భారీ ఎత్తున డిమాండ్ ఏర్పడింది.

బయటి రాష్ట్రాల్లో దెబ్బతిన్న తోటలు

బయట రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో వైరస్‌లు, ఊజీరోగాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అక్కడి పంటలు రోగాల కారణంగా రెండు నుంచి మూడు కోతల్లోనే పంట కాలం ముగిసిపోయింది. వీటితోపాటు మన రాష్ట్రంలోనూ వివిధ రకాల వైరస్‌లు, ఊజీలు, వేసవి ఎండలకు టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. అయితే అన్నమయ్య జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఎంతో కొంత దిగుబడి వస్తోంది. ప్రస్తుతం బయట రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మన జిల్లా నుంచి టమాటాలు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పండించే టమాటాలకు దేశ వ్యాప్తంగా భారీగా ధరలు వచ్చాయి.

చోరీకి గురవుతున్న కాయలు

టమాటాకు అధిక ధరలు రావడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో తోటల్లో కాయలు చోరీకి గురవుతున్నాయి. రాత్రిళ్లు దుండగులు తోటల్లో చొరబడి కాయల్ని కోసుకెళుతున్నారు. ఉదయాన్నే తోటలకు వెళ్లే రైతులకు కాయలు లేని తోటలు కనిపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అరకొర పంట దిగుబడి రాగా ధరలు ఆశాజనకంగా ఉన్న సమయంలో కాయలు చోరీకి గురి అవుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. కొంతమంది ముఠాలుగా ఏర్పడి రాత్రిళ్లు టమాటాలను దొంగతనం చేస్తున్నారు.

వారం రోజులుగా మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25కేజీలక్రేట్)
జూలై 11	928	రూ.3700
12	986	రూ.4000
13	1054	రూ.4000
14	975	రూ. 3900
15	1080	రూ. 3800
16	1091	రూ.3300
17	985	రూ.3400

టమాటాల చోరీ

ములకలచెరువు : అన్నమయ్య జిల్లా సరిహద్దు ఎర్రబల్లికి చెందిన రైతు క్రిష్టారెడ్డి టమాటాల పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు.బాధిత రైతు ఐదు ఎకరాలలో టమాట పంట సాగుచేశాడు. మార్కెట్‌లో 30 కేజీల బాక్సు రూ.2 వేల నుంచి రూ. 3 వేల వరకు ధర పలుకుతోంది. పొలంలో సుమారుగా 20 క్రేట్ల వరకు టమాటాలు చోరీ అయ్యాయని, వాటి విలువ రూ.40 వేలు వరకు ఉంటుందన్నారు.

• రాత్రిళ్లు తోటలకు కాపాలా



టమాటాలు చోరీకి గురవుతుండటంతో చేసేదిలేక రైతులు పొలాల వద్దనే రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం నుంచి ఏడు ఎకరాల వరకు ఓ రైతు సగటున టమాటా పంట సాగు చేశాడు. గతంలో టమాటాలకు మంచి గిట్టుబాటు ధరలున్నా రైతులు పొలాల వద్ద కాపలా ఉండేవారు కారు. అయితే ప్రస్తుతం టమాటా ధరలు ఓవైపు భారీ ఎత్తున పుంజుకోవడం మరోవైపు రాత్రిళ్లు టమాట తోటల్లో చోరీలు ఎక్కువ కావడంతో కాపలా కట్టుదిట్టం చేసుకొంటున్నారు. కొంతమంది పంట నలువైపులా గుడిసెలు వేసుకొని నలుగురు వ్యక్తులకు టార్చ్‌లైట్లు ఇచ్చి కాపాలాగా ఉంచుకొంటున్నారు. రాత్రిళ్లు అప్పడప్పుడు టార్చ్‌లైట్లతో పొలంలో తిరుగుతున్నారు. కొన్నిచోట్ల రాత్రిళ్లు పంటకు కాపాలా కాసేవారు అరుపులు, కేకలు వేస్తూ ఇక్కడ కాపాలాగా ఉన్నాం అన్న సంకేతాలు ఇస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ–జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జేసీ ఫర్మన్‌అహ్మద్, డీఆర్‌ఓ సత్యనారాయణ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అంజన్న సర్వీస్ రిక్వెస్ట్‌లకు టోకెన్‌జనరేట్ చేసి వాటిని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఆయా ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల్లో కొన్ని..:

- పెనగలూరు మండలం కట్టావారిపల్లె గ్రామం ప్రజలు తమకు రేగుంటపల్లి దగ్గర ప్రభుత్వం వారు ఇచ్చిన పట్టా భూములు సాగు చేసుకుంటున్నాం. ఆర్థిక పరిస్థితుల వల్ల సాగు భూములకు నీటివసతి కోసం మేము బోర్లు వేసుకోలేక పోయాం వైఎస్ఆర్ జలకళ కింద బోర్ వేయించాలని కలెక్టర్‌కి అర్జీ సమర్పించారు.
- రాజంపేట మండలం కూచివారిపల్లె ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన భారతి.. పేదవారమైన తమకు నివసించడానికి ఇల్లు లేదని, జగనన్న లేఔట్‌లో ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- ములకలచెరువు మండలం పెద్దపాళ్యం గ్రామం హరిజనవాడ కాపురస్తులు గంగులమ్మ, సునీత, అంజనమ్మ, శారద తాము నివాసం ఉన్న ప్రాంతంలోని గృహాలకు నీటివసతి, విద్యుత్‌సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి సర్వీస్ రిక్వెస్ట్ వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం గుర్రంకొండ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఎంఈఓలతో జగనన్న సురక్ష, చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పట్టణ, గ్రామ వార్డులలో వలంటీర్, గృహసారథులు ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రిన్సిపల్, హెడ్మాస్టర్లపై ఆగ్రహం

గుర్రంకొండ : గుర్రంకొండ ఉర్దూ కళాశాల ప్రిన్సిపల్, ఉర్దూహైస్కూల్ హెడ్మాస్టర్ల పనితీరుపై జిల్లా కలెక్టర్ గిరీషా ఆగ్రహం వ్యక్తం చేశారు.చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ ప్రోగ్రామ్ కార్యక్రమం సక్రమంగా నిర్వహించలేదంటూ మండిపడ్డారు. అందులోని లోటుపాట్లను దగ్గరుండి సరిచేయించారు. మండలకేంద్రమైన గుర్రంకొండలోని ఉర్దూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉర్దూ జెడ్పీహైస్కూళ్లలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల, హైస్కూళ్లలో చదవుతున్న విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ ప్రోగ్రామ్ కింద ఆన్‌లైన్‌లో నమోదు చేశారా లేదా అన్న వివరాలు పరిశీలించారు. అయితే పలువురు విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో లేక పోవడంతో మండిపడ్డారు. 18 సంవత్సరాలోపు పిల్లలందరూ ఎక్కడ చదువుకుంటున్నారో ముందుగా ఆయా ప్రాంతాలకు చెందిన వలంటీర్లు ఎడ్యుకేషన్ యాప్ ద్వారా సర్వే చేయా లన్నారు. ఈ సమాచారాన్ని ప్రిన్సిపల్, హెడ్మాస్టర్లకు అందజేసి పిల్లల వివరాలు యాప్ ద్వారా ఆన్‌లైన్ తప్పనిసరిగా చేయించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ వలంటీర్లకు, ప్రిన్సిపల్, హెడ్మాస్టర్లకు కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్నారు.వారికి గంట సమయం ఇచ్చి విద్యార్థులందరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. డీఈవో పురుషోత్తం,జిల్లా ల్యాండ్ సర్వే ఏడీ జయరాజ్, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో వెంకటేశులు, ఎంఈవో సురేంద్రబాబు పాల్గొన్నారు.

మేఘం కరిగి.. వర్షం కురిసి

- జల్లులతో పులకరించిన జిల్లా కేంద్రం



రాయచోటిలో మేఘావృతమైన ఆకాశం

సాక్షి రాయచోటి : ఖరీఫ్ సీజన్‌లో అన్నదాత పదును వర్షం కోసం ఎదురు చూస్తున్నాడు. మరోవైపు సోమవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. అంతేకాకుండా వాతావరణంలో పూర్తి స్థాయిలో మార్పులు కనిపిస్తున్నాయి. చిరు జల్లులు కూడా పడటంతో రాత్రి చలివాతావరణం కనిపించింది. రెండు, మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలియజేసిన నేపథ్యంలో రైతన్నల్లో ఆశలు చిగురుస్తున్నాయి. ఒక్క భారీ వర్షం పడితేచాలు వెంటనే అదునులో పంట వేయడానికి రైతులకు అవకాశం ఉంటుంది.

మందకొడిగా సాగు

అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం పంటల సాగు మందకొడిగా సాగుతోంది. జూన్ నెల రెండో వారంలో కురిసిన తొలకరి వర్షాలకు కొంతమేర రైతులలు పంటలు సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా వేరుశనగ సాధారణ విస్తీర్ణం 60 వేల హెక్టార్ల వరకు ఉండగా, ప్రస్తుతం ఐదు వేలలోపు మాత్రమే సాగైంది. వరి కూడా 8–10 వేల హెక్టార్లలో సాగు కానుండగా ఇప్పటివరకు 500 హెక్టార్లలో మాత్రమే సాగైంది. వరికి సంబంధించి ఇంకా చాలా సమయం ఉండడంతో ఇప్పటికీ నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకుంటారని అంచనా వేస్తున్నారు. కంది, అలసంద, పిల్లిపెసర, పత్తి, పొద్దుతిరుగుడు పంటలతోపాటు ఉద్యాన పంటలు కూడా ఇదే సీజన్‌లో సాగు చేస్తారు. అయితే ప్రస్తుతానికి ఖరీఫ్ సాగు కొంతమేర తక్కువగా ఉన్నా వర్షం రాకతో పుంజుకుంటుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

జూలై నెలాఖరు వరకు అదను

సాధారణంగా ఖరీఫ్ సాగు జూన్‌లో ప్రారంభమైనప్పటికీ జులై 15లోపు పదును వర్షం పడితే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. విత్తనం కొంత ఆలస్యమైనప్పటికీ దిగుబడిలో మాత్రం తేడా ఉండదని చెబుతున్నారు. ఒకవేళ జులై చివరి నాటికి కూడా వర్షాలు పడకపోతే ఆగస్టులో వర్షాలను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చు.

జిల్లాను తాకిన జల్లులు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు మిగతా ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వాతావరణంలో కూడా మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాత్రికి చలి పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతం కావడం అన్నదాతల్లో ఆశలు పెంచుతోంది.

నందలూరు రైల్వే క్రూ సెంటర్ ఖాళీ!

- 55 మంది లోకో పైలెట్ల మూకుమ్మడి బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన డివిజన్ ఉన్నతాధికారుల



నందలూరు క్రూ సెంటర్

రాజంపేట : గుంతకల్ డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు బ్రిటీషు పాలకుల నుంచి వెలుగొందిన నందలూరు రైల్వే క్రూసెంటర్‌ను ఖాళీ చేయించేందుకు దిశగా అడుగులు పడ్డాయి. లోకోపైలెట్లను మూకుమ్మడి బదిలీలు చేసేశారు. గుంతకల్ రైల్వేడివిజన్ ఉన్నతాధికారి పేరుతో ఉత్తర్వులు జారీ అయినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. డిపో పరిధిలో.90 మంది ఎల్‌పీజీ (లోకో పైలెట్ గూడ్స్)లు ఉన్నారు. ఇందులో 55 మందిని రేణిగుంట, ఎర్రగుంట్లకు బదిలీ చేశారు. ఇంకా 17 మంది రిలీవ్ కాలేదు. మిగిలిన 35 మంది అక్టోబరు లోపు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. నందలూరు రన్నింగ్‌స్టాప్‌లో ఉన్న లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్ల మూకుమ్మడి బదిలీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది

ఎర్రగుంట్ల డిపోపై రన్నింగ్‌స్టాప్ ప్రతికూలత

ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారి స్వార్థం ఫలితంగా ఎర్రగుంట్ల క్రూసెంటర్ పుట్టుకొచ్చిందని రైల్వే వర్గాల్లోనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందలూరు క్రూ సెంటర్‌ను క్లోజ్ చేసేందుకు జాతీయస్థాయిలో ఉన్న ఓ కాషాయనేత తన పలుకుబడితో రైల్వేబోర్డు నుంచి కూడా పరోక్షంగా ఒత్తిడి చేయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రతికూల పరిస్థితిలో ఉన్న ఎర్రగుంట్ల డిపో పరిధిలో పనిచేయడాన్ని రన్నింగ్‌స్టాప్ వ్యతిరేకిస్తున్నారు. ఆ అధికారి స్వార్థం ఫలితంగా రైల్వేకు అదనపు భారం మోపారు. ఈవిషయంను రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

కొత్త డీఆర్ఎం అయినా ..

గుంతకల్ డీఆర్ఎం వెంకట్రామిరెడ్డిపై రైల్వేబోర్డు బదిలీవేటు వేసింది. ఈయన స్థానంలో మనీషా అగర్వాల్ డీఆర్ఎంగా నియమితులయ్యారు. ఇంకా బాధ్యతలు తీసుకోలేదు. ఈయన రాకతో ఎర్రగుంట్ల డిపో ఏర్పాటు, నందలూరు డిపో నిర్వర్యం చేసిన అంశాలను తీసుకెళ్లాలని స్థానిక నాయకులు భావిస్తున్నారు. డిపో మూసివేతకు గుంతకల్ డివిజన్‌లో సంబంధిత ఉన్నతాధికారులు ఉత్సాహంగా ఉన్నట్లుగా కనిపిస్తోంది



మదనపల్లె - తిరుపతి ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తదితరులు

ఆర్టీసీకి అండగా సీఎం జగన్

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి
- మదనపల్లె – తిరుపతి ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం

మదనపల్లె : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏపీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా చేయడమే కాకుండా, సంస్థకు అన్నివిధాలుగా అండగా నిలిచారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ–2 డిపోలో మదనపల్లె – తిరుపతి మధ్య నడిచే ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను వారు ప్రారంభించారు. వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డి, కడప ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.. డిపో ఆవరణలో మొత్తం 12 ఏసీ బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ 12 బస్సులు తెల్లవారుజామున 5 గంటల నుంచి రాత్రి.8.45 గంటల వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. మదనపల్లె నుంచి తిరుపతికి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.230 చొప్పున చార్జీ వసూలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఏపీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా 53,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబాల జీవితాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. దేశంలోని 27 రాష్ట్రాల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన దాఖలాలు లేవని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చెప్పిన మాట ప్రకారం 6నెలల కాలంలో కమిటీ వేసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవడమే కాకుండా రెండేళ్లపాటు సంస్థ పాత అప్పులు చెల్లించుకునేందుకు అవకాశం ఇచ్చారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రతినెలా ఠంచనుగా జీతాలు ఇవ్వడంతో సంస్థ పీఎఫ్ బకాయిలు రూ.900కోట్లు, సీసీఎస్ బకాయిలు రూ.672 కోట్లు మొత్తం దాదాపుగా 1,600 కోట్లు అప్పు చెల్లించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్రంలో హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలుచేస్తున్నామన్నారు. ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తెచ్చేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనివారణలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వాటిలో అలిపిరి డిపోకు 100 బస్సులను కేటాయిస్తే అందులో 50 తిరుపతి–తిరుమల, 14 తిరుమల–రేణిగుంట, 12 కడప–తిరుపతి, 12 తిరుపతి–నెల్లూరు, 12 మదనపల్లె–తిరుపతి ప్రవేశపెట్టామన్నారు. ఎమ్మెల్యే, చైర్మన్, తదితరులను పలు అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వరదారెడ్డిగారినారదరెడ్డి, తిరుపతి, అన్నమయ్య జిల్లా డీపీటీఓలు జితేంద్రనాథరెడ్డి, రాము, ఎలక్ట్రికల్ బస్సుల ప్రాజెక్ట్ మేనేజర్ డి.ప్రభాకర్, మదనపల్లె ఆర్టీసీ–1,2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముంపు గ్రామాలకు ఫ్రిజ్‌ల వితరణ



ఫ్రిజ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : మండలంలో వరద ముంపునకు గురైన ఏకిరిపల్లె, పులపుత్తూరు, తొగురుపేట, మందపల్లి, గుండ్లూరు గ్రామాలకు ఏపీఎన్ఆర్‌టీఎస్ కువైట్ వారి సహాయంతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి చేతుల మీదుగా సోమవారం ఫ్రిజ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఏపీఎన్ఆర్‌టీఎస్ ప్రతినిధులు వరద ముంపు గ్రామాలకు తమవంతుగా ఫ్రిజ్‌లు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పులపుత్తూరు సర్పంచ్ జగన్, బీము సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, కువైట్ వైఎస్సార్ సీపీ ప్రతినిధులు మహేష్‌రెడ్డి, ఇలియాస్, వెంకట సుబ్బారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు



మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు : పట్టణంలోని టోల్గేట్ సెంటర్ సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద సోమవారం గుర్తుతెలియని అనాథ వృద్ధురాలు మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లి దహన సంస్కారాలు చేశారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

- జాతరకు రెండు వందల ఏళ్లకుపైగా చరిత్ర
- రేపు అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి వేడుక

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లెలో వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లో ఎంతో విశిష్టత సంతరించుకుంది. ఆ గ్రామంలో గంగమ్మ స్వయంభుగా వెలసిందని పెద్దలు చెబుతున్నారు. ఏటా ఇక్కడ నిర్వహించే జాతరకు రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఒకే ఒక రోజు జరిగే ఈ జాతరకు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తారు. జాతరలో పాల్గొని అమ్మవారిని పూజించి పనులు ప్రారంభిస్తే తప్పక నెరవేరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల బలిజపల్లె గంగమ్మ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గంగమ్మ జాతర వేడుక ప్రారంభం కానుంది.

సంప్రదాయాల సమ్మేళనం

బలిజపల్లె గంగమ్మ జాతర అనేక సంప్రదాయాల సమ్మేళనం అనే చెప్పాలి. అమ్మవారి జాతరను బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి నిర్వహిస్తారు. అందువల్ల తొలుత బలిజపల్లె జాతర నిర్వాహకులు జాతర తేదీని నిర్ణయించి.. అనంతరం తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె నిర్వాహకులతో వారి గ్రామాల్లో చర్చించి జాతర తేదీని ఖరారు చేస్తారు. అనంతరం ఒక ఆదివారం అంకురార్పణ చేసి ఆ తరువాత వచ్చే గురువారం జాతరను నిర్వహిస్తారు. అయితే జాతరకు ముందురోజు అర్ధరాత్రి నుంచే అమ్మవారి వేడుక అంగరంగ వైభవంగా ప్రారంభమవుతుంది. పై మూడు గ్రామాలకు చెందిన వారు అమ్మవారికి వివిధ రకాల సాంగ్యాలతో జాతరను ఘనంగా నిర్వహస్తారు.



బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

బలిజపల్లెలో రూపుదిద్దుకోనున్న అమ్మవారి ప్రతిమ

జాతరలో కొలువుదీరే గంగమ్మ ప్రతిమను బుధవారం రాత్రి నుంచి ఆ గ్రామంలోని ఓ వేపచెట్టు కింద దాదాపు ఆరుగంటల పాటు తయారు చేస్తారు. అనంతరం అమ్మవారి ప్రతిమను నిర్వాహకులు పూలరథంలో ఊరేగించుకుంటూ.. వేపమండలతో తయారు చేసిన గుడిలోకి ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువు తీర్చుతారు. అమ్మవారు గుడిలోకి ఊరేగింపుగా వచ్చే సమయంలో భక్తులు పెద్ద ఎత్తున ఎదురుగుంభం ఇచ్చేందుకు పోటీపడతారు. ఈ కారణంగా కేవలం యాభై అడుగుల దూరంలో ఉండే గుడిలోకి అమ్మవారిని తీసుకురావడానికి దాదాపు రెండు గంటల సమయం పడుతుంది. అమ్మవారిని గుడిలోకి తీసుకొచ్చే సమయంలోనే ఆ గ్రామానికి చెందిన పలువురు విశేష పూజలు నిర్వహించి సాంగ్యాలు సమర్పిస్తారు. అమ్మవారు గుడిలో కొలువు దీరగానే జాతర ఊపందుకుంటుంది.



జాతరలో భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారి రూపం (ఫైల్)

తుమ్మల అగ్రహారం నుంచి గండదీయలు

బలిజపల్లెలో కొలువైన గంగమ్మకు తుమ్మల అగ్రహారం పుట్టినిల్లని పెద్దలు చెబుతుంటారు. అందువల్ల తుమ్మల అగ్రహారానికి చెందిన మహిళలు జాతరలో అమ్మవారు గుడిలో కొలువుదీరగానే గండదీయలను సమర్పిస్తారు. అగ్రహారం మహిళలు తీసుకొచ్చిన గండదీయలను చెల్లించే సమయంలో.. అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉండే వేలాది మంది భక్తులను సైతం నిలిపివేస్తారు. గండదీయల చెల్లింపులో జాతర నిర్వాహకులు అగ్రహారం మహిళలకు ప్రత్యేకమైన ప్రాధాన్యతను ఇవ్వడం విశేషంగా చెప్పవచ్చు.

నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు

జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు తీసుకొస్తారు. ఈ సందర్భంగా గంగమ్మ సోదరుడైన పోతురాజును తప్పెట్లతో ఉత్సాహంగా బలిజపల్లెకు తీసుకొస్తారు. పోతురాజు ఊరేగుతూ వచ్చే సమయంలో భక్తులు కర్రసాము, ఐదడుగు నృత్యాలు చేస్తూ కోలాహలంగా బలిజపల్లెకు చేరుకుంటారు.

'ఎర్రచందనం' స్వాధీనం

దువ్వూరు : జిల్లెల్ల గ్రామ సమీపంలోని కుందూ నది ఒడ్డున గడ్డి పొదల్లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైదుకూరు రూరల్ ఇన్‌చార్జి సీఐ బీవీ చలపతి వివరాలు వెల్లడించారు. 12 ఎర్రచందనం దుంగలతోపాటు మూడు పట్టుడు రాళ్లు, ఒక గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎద్దుల వెంకటరమణ, దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు, కలసపాడు మండలం చెన్నుపల్లె గ్రామానికి చెందిన గట్టు భాస్కర్, చాగలమర్రి మండలం పెద్దవంగలికి చెందిన వడ్ల నరసింహయ్యను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

పొలంలో టమాటాల చోరీ

ములకలచెరువు : జిల్లా సరిహద్దు గ్రామమైన ఎర్రబల్లికి చెందిన రైతు క్రిష్టారెడ్డి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున టమాటాల చోరీకి పాల్పడ్డారు. ఆయన ఐదు ఎకరాలలో టమాట పంట సాగు చేశాడు. మార్కెట్‌లో 30 కేజీల బాక్సు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. పొలంలో సుమారుగా 20 క్రేట్ల వరకు టమాటాలు చోరీకి పాల్పడినట్లు బాధితర రైతు చెప్పాడు. వాటి విలువ రూ.40 వేల వరకు ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జగన్ కాలనీలో నివాసముంటున్న ఆనంద్‌బాబు(30) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా మండల సరిహద్దు గ్రామం బార్లపల్లి వద్ద ఆకస్మాత్తుగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి వాహనంలో నుంచి కిందపడ్డాడు. అలాగే బి.కొత్తకోట మండలం బండికిందకురవపల్లెకు చెందిన జి.చిన్న రెడ్డప్ప(52) ఏ.నాగమల్లు(60)తో కలిసి ద్విచక్రవాహనంలో కంటేవారి వారిపల్లెకు, మరో ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు చెందిన ఎస్.హరీష్ (28) ఎదురు ఎదురుగా వస్తుండగా మార్గంమధ్యలోని కోళ్లఫారం వద్ద ఢీకొన్నారు. ప్రమాదంలో చిన్నరెడ్డప్పకి కాలు విరిగి తీవ్రంగా గాయపడగా, నాగమల్లు, హరీష్‌లు సైతం గాయపడ్డారు. మదనపల్లెకు చెందిన ఎహసాన్ (28) ద్విచక్రవాహనంలో అంకిశెట్టిపల్లె నుంచి మదనపల్లెకు వస్తుండగా మార్గంమధ్యలో ఓ ఇంటి నుంచి అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. అనంతరం కుక్కను విడిచిపెట్టిన వారితో వాగ్వివాదానికి దిగాడు. వారు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత ఘటనల్లో ఆయా పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

రాజంపేట : చెయ్యేరులో ఆదివారం లభ్యమైన మృతదేహం కడప నగరంలోని రాజారెడ్డివీధి సియోనపురానికి చెందిన మలూరు శ్రీనివాసుల(59)ది గుర్తించామని రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య తెలిపారు. సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయనకు అప్పులు అధికమయ్యాయని సీఐ పేర్కొన్నారు. అప్పులు తీర్చేందుకు ఉద్యోగానికి కూడా వీఆర్ఎస్ ఇచ్చారన్నారు. అప్పుల బాధ తట్టుకోలేక జీవితం మీద విరక్తి చెంది చనిపోవాలనే ఉద్దేశంతో విషం తీసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణ అయిందన్నారు. మన్నూరు పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనువాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి సంబంధీకులకు అప్పగించామన్నారు.

మహిళ ఆత్మహత్య

పెద్దమండ్యం : మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ కుదుములవారిపల్లెలో ఓ మహిళ ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం ఆమినిగుట్ట పంచాయతీ రామయ్య గట్టుకు చెందిన మునీశ్వరీ (23), రామసముద్రం మండలం ఆవులపల్లెకు చెందిన విశ్వనాథ్ ప్రేమించి ఏడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయి తల్లి వద్దే ఉండేది. ఈ క్రమంలో కుదుములవారిపల్లెకు చెందిన శ్రీనివాసులుతో పరిచయం ఏర్పడి అతనితో కలిసి ఉంటోంది. ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండగా చికిత్సలు చేయించుకుంది. కడుపునొప్పి తాళలేక, జీవితంపై విరక్తితో గుళికల మందు తిని అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు పెద్దమండ్యం పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేస్తుండగా మృతి చెందింది. మృతురాలి తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఇషాక్ తెలిపారు.

గ్యాస్ స్టవ్ పేలి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : గ్యాస్ స్టవ్ పేలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం -2 పంచాయతీ నేతాజీ కాలనీకి చెందిన ఎం.బాబు (45) స్థానికంగా టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఉదయం వండిన చికెన్‌ను రాత్రి వేడి చేసుకునేందుకు స్టవ్ వెలిగించాడు. ఈ క్రమంలో ప్రమాదశాత్తు గ్యాస్ స్టవ్ పేలి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. వారి సూచన మేరకు తిరుపతికి తీసుకెళ్లారు.

మెప్మా ఆర్పీ మోసం నుంచి కాపాడండి



కమిషనర్ ప్రమీలకు విన్నవిస్తున్న బాధితుడు

మదనపల్లె : మెప్మా ఆర్పీ సుజాత ఫోర్జరీ సంతకాలతో తమ పేరుతో బ్యాంకు నుంచి లోను తీసుకుని మోసం చేసిందని, దీంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు తాము దూరమయ్యామని, తమకు న్యాయం చేయాలని బాధితులు కమిషనర్ ప్రమీలకు విన్నవించారు. సోమవారం మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఇందిరానగర్‌కు చెందిన సయ్యద్‌బాషా తమ కుటుంబానికి జరిగిన అన్యాయంపై కమిషనర్‌తో గోడు వెళ్లబోసుకున్నాడు. కూలీ పనులతో జీవనం సాగిస్తున్న తాను, కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భార్య షేక్ మెహతాజ్‌భానును సత్యసాయి ఎస్‌హెచ్‌జీ గ్రూపులో మెంబర్‌గా చేర్పడం జరిగిందన్నారు. గ్రూపు ఆర్పీగా వ్యవహరిస్తున్న సుజాత సభ్యుల అనుమతి లేకుండానే.. గంగాభవాని ఎస్‌హెచ్‌జీగా మార్పుచేసి సభ్యులందరి సంతకాలను ఫోర్జరీ చేసి బ్యాంకు నుంచి లోను తీసుకుందన్నారు. ఈ విషయం తమకు తెలియదన్నారు. కొంతకాలం తర్వాత బ్యాంకు నుంచి లోను చెల్లించాల్సిందిగా నోటీసులు రావడంతో వెళ్లి పరిశీలించగా, జరిగిన మోసం తెలిసిందన్నారు. దీనిపై బ్యాంకు మేనేజర్‌కు తమకు సంబంధం లేదని చెప్పినా వినకపోగా, తీసుకున్న లోను చెల్లించాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నాడన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం కుమార్తె చదువుకు వేసిన అమ్మ ఒడి ఆర్థిక సహాయం, జగనన్న లేఅవుట్‌లో మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి సంబంధించిన మొత్తాలను బ్యాంకు ఖాతా నుంచి డ్రా చేసుకోనివ్వడం లేదన్నారు. దీంతో తమ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందన్నారు. మెప్మా ఆర్పీ సుజాత మోసంతో తమ కుటుంబంలో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయని, ఆమె మాత్రం ఏమీ తెలియనట్లు నిశ్చింతగా ఉంటోందన్నారు. మున్సిపల్ అధికారులు మెప్మా ఆర్పీ సుజాత మోసంపై విచారించి, బ్యాంకు అధికారుల ఒత్తిడి నుంచి తన కుటుంబాన్ని రక్షించి, తనకు రావాల్సిన ప్రభుత్వ పథకాల నగదు ఇప్పించాల్సిందిగా కోరాడు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతి చెందిన సుహాసిని

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన సూరపురెడ్డి సుహాసిని అలియాస్ బుజ్జమ్మ (48) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. భర్త క్రిష్టారెడ్డితో కలిసి సుహాసిని పశువులకు మేత తెచ్చేందుకు పొలానికి వెళ్లింది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాపం పసివాడు..!

- మాటలు రావు.. దెబ్బలు తినడమే..
- తల్లి, ఆమె ప్రియుడు చేతిలో గాయపడి..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



బిడ్డ మృతితో రోదిస్తున్న తండ్రి అబ్దుల్లా

నందలూరు(రాజంపేట) : పాపం పసివాడు.. మూగతనం శాపంగా మారింది. ఎవరు కొట్టినా దెబ్బలు తినడమే తప్ప, చెప్పుకోలేడు. దీంతో మౌనంగానే రోదించే వాడు. చివరికి తల్లి, ఆమె కలిసి వుంటున్న వ్యక్తి చేతిలో చిత్రహింసలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నందలూరు మండలంలోని అరవపల్లెలో జహీరున్నీషా, అబ్దుల్లా దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్నవాడు షాహిద్(10)కు మాటలు రావు. తల్లిదండ్రులు విడిపోయారు. ఇద్దరు పిల్లలను మదరసాలో చేర్పించారు. చిన్నవాడు తల్లి దగ్గరే ఉంటున్నాడు. జహీరున్నీషా మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. తన సహజీవనానికి అడ్డుగా ఉంటున్నాడని తనయుడిని గత నెల 28న చిత్రహింసలు పెట్టింది. ఈ సంఘటన స్థానిక పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. కౌన్సెలింగ్ ఇచ్చారు. బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని హితబోధ చేసి పంపించారు.

నాలుగు రోజుల క్రితం..

మైదుకూరుకు చెందిన ఓ మహిళ ద్వారా చాగలమర్రిలోని పంచాయతీ కార్యాలయంలో స్వీపరుగా లక్ష్మీనారాయణతో పరిచయం పెంచుకుంది. ఆ పరిచయం వారిద్దరూ కలిసి ఉండటానికి దారితీసింది. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం ఇంటిలో తలుపు మూసి లక్ష్మీనారాయణ, జహీరూన్‌లు షాహిద్‌ను చితకబాదినట్లుగా స్థానికులు చెప్పారు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించిందని వైద్యుల సూచన మేరకు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పోలీసుల అనుమతి లేకపోవడంతో నిరాకరించారు. ఇంట్లో మెట్లపై నుంచి పడి గాయపడినట్లుగా బుకాయించారు. దీంతో అనుమానం వచ్చి చాగలమర్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఈ క్రమంలోనే ఈ బాలుడు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు అక్కడ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని సోమవారం నందలూరుకు తీసుకొచ్చారు. తండ్రి అబ్దుల్లా తన బిడ్డ పరిస్థితిని చూసి బోరున విలపించారు.



ప్రతి ఫిర్యాదును పరిష్కరించాల్సిందే




బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : చట్ట పరిధిలో ప్రతి ఫిర్యాదును పరిష్కరించాల్సిందేనని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ గంగాధర్ రావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 65 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ప్రతి కేసు విషయాన్ని కూలంకుశంగా అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలియపరిచారు. స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితులలో కూడా అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. స్పందనలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు అందాయన్నారు.

నిజాయితీతో పని చేయాలి: పోలీసులు విధి నిర్వహణలో చాకచక్యంగా, నిజాయితీతో బాధ్యతలను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విజయవాడ ఇంటెలిజెన్స్ బృందంచే ఐదు రోజుల పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ టీంకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పొందిన పోలీసులు విధి నిర్వహణలో చేపట్టాల్సిన బాధ్యతల గురించి ఎస్పీ ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, ఆర్ఐ పెద్దయ్య, ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు జట్టు ఘన విజయం



క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న కడప, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ–సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 140 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 38.3 ఓవర్లలో మరో 6 పరుగులు చేసి 146 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. నెల్లూరు బౌలర్లు సుతేజ్‌రెడ్డి 3, అబ్దుల్ 2, చిన్నబాబు 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 15.3 ఓవర్లలో 43 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కర్నూలు బౌలర్ అక్షిత్‌రెడ్డి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో రాణించగా, వరుసగా రెండో ఇన్నింగ్స్‌లో సైతం 6 వికెట్లు తీసి.. ఒక్క మ్యాచ్‌లో 12 వికెట్లు తీసి సత్తా చాటాడు. దీంతో కర్నూలు జట్టు 239 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 395 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహించిన కడప, చిత్తూరు మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడో రోజు 383 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 104.4 ఓవర్లలో 438 పరుగులు చేసి ఆలౌట్ అయింది. చిత్తూరు బౌలర్ బాలాజీ 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 77 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. జట్టులోని గౌతమ్‌కృష్ణ తేజారెడ్డి 78 పరుగులు చేశాడు. ఈయనకు జతగా జెనిక్‌దాస్ 65 పరుగులు చేశాడు. కడప బౌలర్ సాయి ఆర్థిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 279 పరుగులు చేయగా, కడప జట్టు 438 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చిన్నమండెం తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామ పంచాయతీ దళితవాడ సమస్యలపై తహసీల్దార్ శ్రీరాములునాయక్‌పై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో వండాడి గ్రామ సచివాలయానికి వచ్చిన కలెక్టర్‌తో దళితవాడ ప్రజలు తమ గృహాలు ఆన్‌లైన్ చేయాలని, స్కూల్‌కు ఎకరం స్థలం కేటాయించాలని, దళితవాడ–గాండ్లపల్లె రోడ్డుకు అడ్డంకులు తొలగించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. అదే రోజు తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ స్కూల్‌కు ఎకరం స్థలం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ ఆదేశించి 8 నెలలు గడిచినా సంబంధిత అంశాలపై ఎలాంటి పురోగతి లేకపోవడంతో దళితవాడ ప్రజలు సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్.. తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా ఏఓను ఆదేశించారు. మూడు రోజుల్లోగా సరైన వివరణ లేకుంటే సస్పెండ్ చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఫిర్యాదుదారులైన వండాడి వెంకటరమణ, ఎగువేళ్ల గంగులయ్య, ముగ్గళ్ల రామచంద్రలతోపాటు గ్రామ ప్రజలు తెలిపారు. ఇదే విషయమై తహసీల్దార్ శ్రీరాములునాయక్‌ను వివరణ కోరగా.. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో షోకాజ్ నోటీసులు ఇస్తానన్న మాట వాస్తవమేనని, మూడు రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని తెలిపారన్నారు. ఈ దళితవాడకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున తాను ఆన్‌లైన్ చేయలేకపోయానని, ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలియజేశారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న గజ్జెల లక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రూరల్ ప్రాజెక్టు పరిధి పెండ్లిమర్రి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, హాస్టల్‌ను ఏపీ మహిళా కమిషన్ మెంబర్ గజ్జల లక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె హాస్టల్‌లోని వంటలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తరువాత గుర్రాల చింతలపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, సీడీపీఓ రమాదేవి, సూపర్‌వైజర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.